సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

బుధవారం | 25 | జనవరి | 2023



సోలార్ యూనిట్ ఏర్పాటుతో...
సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు అన్నారు.
- 8లో▸



మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం
మహిళలకు అన్ని విధాలా చేయూతనిస్తూ వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి దయాకర్‌రావు అన్నారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
34.8°/14.9°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. చలి తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత ఉంటుంది. సాయంత్రం చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఇన్‌చార్జ్ డీఈఓగా రాంకుమార్

భూపాలపల్లి అర్బన్: ఇన్‌చార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారిగా రాంకుమార్‌ను నియమిస్తూ విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారిగా పనిచేసిన రాజేందర్ 20రోజుల నుంచి దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. హనుమకొండ డీఈఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఏడీ రాంకుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

108 వాహనాలను తనిఖీ చేసిన కో ఆర్డినేటర్

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని 108, 102 వాహనాలను కోఆర్డినేటర్ మహేష్, జిల్లా మేనేజర్ మెరుగు నరేష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 108 సిబ్బందికి తగిన సూచనలు, వాహనాల పనితీరు, ఆపరేషన్ ఫ్లైట్ పారామీటర్స్ గురించి తెలుసుకున్నారు. వెహికల్ మెయింటెనెన్స్ చేయాలని, ప్రమాదాలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రజలకు మంచి సేవ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది మల్లారెడ్డి, సుజాత, విజయ్, సుధాకర్, సారంగపాణి పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలను రద్దుచేయాలి



టేకుమట్ల(రేగొండ): విద్యుత్ ఏసీడీ చార్జీలను వెంటనే రద్దుచేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. విద్యుత్ ఏసీడీ చార్జీల పెంపును నిరసిస్తూ మంగళవారం రేగొండ మండలకేంద్రంలోని ప్రధాన రోడ్డుపై మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితుల్లో నిత్యావసర సరుకుల ధరలు పెంచారన్నారు. ఇప్పుడు విద్యుత్ చార్జీలతో పాటు ఏసీడీ చార్జీలను పెంచడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామాల్లో వందల్లో వచ్చే విద్యుత్ బిల్లులు ఇప్పుడు వేలల్లో వస్తుండడంతో ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏసీడీ చార్జీలను ఇప్పటికైనా తగ్గించాలని లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చంద్రమౌళి, కిష్టయ్య, రవికుమార్, రవీందర్, ఓంప్రకాశ్, రాజయ్య, తిరుపతి పాల్గొన్నారు.

నేతకాని సంఘం రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్‌గా రాజేష్ కుమార్



భూపాలపల్లి రూరల్: నేతకాని సంఘం రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్‌గా భూపాలపల్లి పట్టణానికి చెందిన గజ్జి రాజేష్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర నాయకులు దుర్గం నర్సయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లాల యూత్ నాయకులకు రాజేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఉద్యోగ నియామక పత్రాలు అందజేత



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలో కారుణ్య నియామకాలు పొందిన అభ్యర్థులకు మంగళవారం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు, ఉద్యోగి రక్షణతో కూడిన పనులు చేయాలని, సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించేందుకు అంకితభావంతో పనిచేసి సంస్థను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, యూనియన్ నాయకులు ఎస్వీ రావు, జ్యోతి, తుకారం, శివకేశవరావు, సురేఖ సంజీవరావు, రమేష్ పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన..
గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి ఆధ్వర్యంలో సుభాష్ కాలనీలోని గ్రౌండ్‌లో చేస్తున్న ఏర్పాట్లను ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రావు మంగళవారం పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు జీఎం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు బాలరాజు, తుకారం, శ్యాం ప్రసాద్, శ్రీనివాసు, ప్రవీణ్ పాల్గొన్నారు.

అర్ధాంగికి ఆసరా

పింఛన్ పొందుతూ భర్త మరణిస్తే భార్యకు మంజూరు
- అర్హులను గుర్తించే పనిలో అధికార యంత్రాంగం
- సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ తర్వాతనే దరఖాస్తుల స్వీకరణ
- జిల్లావ్యాప్తంగా లబ్ధిదారులకు ఊరట



కాళేశ్వరం: ఆసరా పింఛన్ అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు భరోసా ఇస్తుంది. పింఛన్ పొందుతూ వ్యక్తి మరణిస్తే అతని భార్యకు 15రోజుల్లో వితంతు, వృద్ధాప్య పింఛను అందించడానికి ప్రభుత్వం ఇటీవల ఉత్వర్వులు జారీచేసింది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో అధికారులు అర్హులను గుర్తించే పనిలో పడ్డారు.

గతేడాది ఆగస్టులో ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేసింది. ప్రభుత్వం ఇంట్లో ఒక్కరికి మాత్రమే పింఛను ఇస్తుంది. పింఛను తీసుకుంటున్న వృద్ధుడు గానీ వ్యక్తిగానీ మరణిస్తే గతంలో దరఖాస్తు చేసుకుని కార్యాలయాల చుట్టూ తిరిగేవారు. ఇటీవల మృతిచెందిన వారి భార్యకు వృద్ధాప్య, వితంతు పింఛన్లు 15రోజుల్లో మంజూరు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. దీంతో అర్హులను గుర్తించే పనిలో అధికారులు పడ్డారు.

విధానం ఇలా...
వృద్ధాప్య పింఛన్‌దారుడు మరణిస్తే తన భార్య ఆధార్‌కార్డుతో పాటు మృతుడి డెత్‌సర్టిఫికెట్ ధృవీకరణ పత్రాన్ని జతచేసి గ్రామాల్లో అయితే పంచాయతీ కార్యదర్శికి, పట్టణాల్లో పురపాలిక కార్యాలయంలో అందించాలి. దరఖాస్తులు పరిశీలించి ఉన్నతాధికారుల ఆమోదానికి పంపిస్తారు. ఈ ప్రక్రియ మొత్తం 15రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఆ తర్వాత పెన్షన్ మంజూరు చేస్తారు. 57ఏళ్ల పైబడిన వారికి వృద్ధాప్య, ఆ లోపు వారికి వితంతు పెన్షన్ వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులను వచ్చేనెల లోపు గుర్తించనున్నారు. ఫిబ్రవరి నుంచి పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం పేర్కొంది. బాధితులను గుర్తించి లబ్ధిచేకూరేలా వెబ్‌సైట్ అప్‌డేట్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

పింఛన్ పొందుతున్న వారి వివరాలు

వృద్ధులు	58,850
వితంతు	22,408
దివ్యాంగులు	6,963
కల్లుగీత కార్మికులు	1,710
చేనేత కార్మికులు	918
డయాలసిస్ బాధితులు	21
బీడీ కార్మికులు	41
ఒంటరి మహిళలు	1,245

సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నాం..
భర్త ఆసరా పింఛన్ పొందుతూ మరణిస్తే భార్యకు వితంతు, వృద్ధాప్య పింఛన్ మంజూరు 15రోజుల్లో చేసేందుకు ప్రభుత్వం ఆదేశాల మేరకు కోసం సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసే పనిలో ఉన్నాం. ఈ నెలలోపు పూర్తిచేస్తాం. అర్హులకు గుర్తించే పనిలో ఉన్నాం.
- పురుషోత్తం, డీఆర్‌డీఓ

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

టేకుమట్ల: మారుమూల గ్రామాల అభివృద్ధే బీఆర్‌ఎస్ పార్టీ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంతో పాటు మండలంలోని రాఘవాపూర్, గర్మిళ్లపల్లి, వెంకట్రావుపల్లి, బూర్నపల్లి, ద్వారకపేట, రామకిష్టాపూర్(వి), రామకిష్టాపూర్(టీ), వెలిశాల, పంగిడిపల్లి, పెద్దంపల్లి, ఆశిరెడ్డిపల్లి, అంకుషాపూర్, సోమనపల్లి గ్రామాలలో సీసీ రోడ్డు, సోమనపల్లిలో నూతన గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణాలకు దీటుగా పల్లెలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పనిచేస్తున్నారని అన్నారు. ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి తెలంగాణలో జరుగుతుందని చెప్పారు. గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు, గ్రామీణ యువతను ప్రోత్సహించేందుకు క్రీడా మైదానాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతుల కోసం ఉచిత విద్యుత్, సబ్సిడీ రుణాలు, పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తుందని గుర్తుచేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, గర్భిణులకు పౌష్టికాహారం సైతం అందిస్తున్నట్లు చెప్పారు. పంగిడిపల్లిలో కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

ఖాళీ బిందెలతో నిరసన..
వెలిశాలలో సీసీ రోడ్ల శంకుస్థాపనకు వచ్చిన ఎమ్మెల్యే కాన్వాయ్‌ను గ్రామస్తులు ఖాళీబిందెలతో అడ్డుకుని నిరసన వ్యక్తంచేశారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యకు గల కారణాలను అడిగి తెలుసుకుని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, పంప్ ఆపరేటర్‌లపై ఆగ్రహం వ్యక్తంచేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డీపీఓతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, సర్పంచ్లు, ఎంపీటీసీలు నల్లబెల్లి రమారవీందర్, శోభామహిపాల్‌రెడ్డి, చింతలపెల్లి విజయాస్వామిరావు, అడగాని లతారామారావు, సంగి రవి, ఉమేందర్‌రావు, గందం వజ్ర సారయ్య, లచ్చిరెడ్డి, సంపత్‌రావు, బందెల నరేష్, ఓదెలు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

భూపాలపల్లి అర్బన్: ఇటీవల 317 జీవోద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం చేపట్టనున్న బదిలీలలో న్యాయం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, తిరుపతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవో నంబర్ 317 ద్వారా బదిలీలు చేపట్టినప్పటికీ నేటివరకు రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు ప్రజాస్వామిక పద్ధతిలో అనేక రూపాలలో ఉద్యమాలు చేపడుతున్నారని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం తమ గోడును పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. చాలామంది ఉపాధ్యాయుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి



హాజరైన విద్యార్థులు

భూపాలపల్లి అర్బన్: బాలికలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి జయరామిరెడ్డి సూచించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి జయరామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలు చదువుతోపాటు ఆటలు, ఉద్యోగం, ఇతర రంగాల్లో రాణించేందుకు పట్టుదలతో పనిచేయాలన్నారు. పట్టుదలతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చని చెప్పారు. మంచి నడవడికతో మెలగాలని తల్లిదండ్రులు తోబుట్టులతో అన్యోన్యంగా ఉండాలని సూచించారు. మహిళా సాధికారికతో ఉందని దేనికి తక్కువ కాకుండా ముందుకు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌చారి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ లక్ష్మి, స్థానిక న్యాయవాదులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నతంగా ఎదగాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి సామ్యూల్

- జిల్లా సంక్షేమాధికారి సామ్యూల్
- ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

భూపాలపల్లి రూరల్: సమాజంలో బాలికలు ఉన్నతంగా ఎదగాలని జిల్లా సంక్షేమాధికారి సామ్యూల్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రగతి భవన్‌లోని సమావేశ మందిరంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలకు సామ్యూల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంబంధిత అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు బాలికలకు వివిధ చట్టాలు, బాలల హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. మహిళలు వెట్టిచాకిరి, లైంగిక, మానసిక, శారీరక, ఆర్థిక, గృహహింసలకు బలికాకుండా బాలల పరిరక్షణ సమితి అధికారులు పనిచేస్తున్నారన్నారు. బాలికలు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. బాలికా దినోత్సవం సందర్భంగా ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ పురుషోత్తం, జిల్లా బీసీ సంక్షేమాధికారి శైలజ, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి సునిత, క్రీడలు, మైనార్టీ అభివృద్ధి అధికారి బుర్ర సునీత, సీడీపీఓలు అవంతి, రాధిక, ఏహెచ్‌టీయూ ఎస్సై ఊర్మిళ, షీ టీం ఎస్సై శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఎప్పుడు ఇస్తరు..

జీఎంను కలిసిన ఫక్కీర్‌గడ్డ, ఆకుదారివాడ రైతులు



జీఎం శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రమేష్, రైతులు

భూపాలపల్లి: తమ భూములను వెంటనే సేకరించి నష్ట పరిహారం అందించాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆకుదారివాడ, ఫక్కీర్‌గడ్డ రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించి ఇబ్బందులను వివరించారు. అనంతరం గ్రామస్తులు, రైతులు మాట్లాడుతూ.. సింగరేణి ఓపెన్‌కాస్ట్ విస్తరణ కోసం ఫక్కీర్‌గడ్డ, ఆకుదారివాడకు చెందిన వ్యవసాయ భూములు, ఇళ్లు కావాలని యాజమాన్యం 2015లో కోరిందన్నారు. అప్పుడు కేవలం 45 ఎకరాలు మాత్రమే తీసుకుందన్నారు. 2019లో రైతులంతా కలిసి 28 రోజుల పాటు ఓసీపీ ఎదుట బైటాయించి నిరవధిక బంద్ చేయగా యాజమాన్యం స్పందించిందన్నారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సమక్షంలో భూములను సేకరిస్తామని, నష్ట పరిహారం అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. అనంతరం ఈ సమస్యను సింగరేణి గాలికి వదిలేసిందని, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ మూలంగా తమ భూములు, ఇళ్లు దెబ్బతిన్నాయని ఇప్పటికైనా వెంటనే పరిహారం అందించాలని కోరారు. ఇందుకు జీఎం శ్రీనివాస్ సానుకూలంగా స్పందించి సమస్యను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. జీఎంను కలిసిన వారిలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్, గ్రామస్తులు, రైతులు ఆకుదారి మమతరాయమల్లు, కోల రాజమల్లు, బుర్ర కుమారస్వామి, మహేందర్, శంకర్, యాకుబ్, మనోజ్ తదితరులు ఉన్నారు.

‘కొత్త’ సాయానికి కత్తెర

రైతుబంధుపై సాంకేతికత ఎఫెక్ట్
- ఉమ్మడి వరంగల్‌లో పలువురికి చుక్కెదురు
- యాసంగి పెట్టుబడి సాయానికి గిరికీలు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు
- 25,499 మంది రైతులకు సాయం దూరం



ఈఫొటోలోని రైతు పేరు బుర్ల విష్ణుమూర్తి. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లి. వానాకాలం, ప్రస్తుత యాసంగి సీజన్‌కు సంబంధించి రైతు బంధు పెట్టుబడి ఇప్పటి వరకు జమ కాలేదు. తల్లి పేరిట 9 ఎకరాల భూమి ఉండగా.. తన పేరిట వానాకాలం సీజన్‌కు ముందే రెండెకరాలు వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. వెంటనే రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఇప్పటికి రెండు విడతలుగా పెట్టుబడి సాయం రావాల్సి ఉండగా.. పోర్టల్‌లో సాంకేతిక సమస్య కారణమంటూ రైతు ఖాతాలో పెట్టుబడి సాయం జమ కాలేదు.



ఈ ఫొటోలోని వ్యక్తిది వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రేలగుంట. పేరు రైతు బత్తిన మహేశ్. గత వానాకాలం నుంచి రైతుబంధు రావట్లేదు. ఉమ్మడి కుటుంబంగా ఉన్న వీరికి 4 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గతంలో ఈ భూమి తల్లి రమాదేవి పేరు మీద పట్టా ఉండేది. ఈ భూమిని వారసత్వంగా ముగ్గురు అన్నదమ్ములకు సమానంగా తలో ఎకరం పట్టా చేయించింది. మిగతా ఎకరం రమాదేవి పేరునే ఉంది. గతంలో నాలుగెకరాలకు రైతుబంధు వచ్చింది. రిజిస్ట్రేషన్ చేయించుకుని ఏడాది గడిచినా రెండు పంటలకు రైతుబంధు రాలేదు. పంటల పెట్టుబడికి ఇబ్బంది అవుతోందని, ప్రైవేట్ అప్పులు చేయాల్సి వస్తోందని మహేశ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

సాక్షిప్రతినిధి, వరంగల్: రైతుబంధు పెట్టుబడి సాయం గత నెల 28 నుంచి విడతల వారీగా విడుదల చేశారు. ఎకరం భూమి ఉన్న వారి నుంచి మొదలుపెట్టి రైతుబంధు పోర్టల్‌లో నమోదైన ప్రతి ఒక్కరికీ జమ చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. వానాకాలం సీజన్‌కు ముందు తర్వాత భూముల క్రయ విక్రయాలు, యాజమాన్య హక్కుల బదిలీల్లో జరిగిన మార్పులు, వారసత్వ పట్టాల మార్పిడి చేసినా చాలామందికి యాసంగి సాయం అందలేదు. కొందరికి వానాకాలం, యాసంగి పంటలకు కూడా రైతుబంధు జమవకపోగా.. ఇప్పటికీ స్పష్టత కొరవడింది. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నప్పటికీ పోర్టల్ మాత్రం ఇప్పటి వరకు తెరుచుకోలేదు. గడువు ముగుస్తున్నా.. నమోదు ప్రక్రియ ప్రాసెసింగ్‌లో ఉన్నట్లు చూపుతోంది. ఫలితంగా రైతులు ఆందోళన చెందుతున్నారు.

అందని ‘బంధు’
ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,62,654 మందికి 14,36,154 ఎకరాలకు సుమారు రూ.709 కోట్ల మేరకు రైతుబంధు రైతుల ఖాతాలో జమయినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ మేరకు నిబంధనల ప్రకారం మరో 25,499 మందికి 30,349 ఎకరాలకు సాయం అందాల్సి ఉంది. గత సీజన్ నుంచి ఇప్పటి వరకు క్రయవిక్రయాలు, వారసత్వంగా భూములు దక్కించుకున్న కొత్త రైతుల వివరాలు ఆన్లైన్లో నమోదు ప్రక్రియ నిలిచిపోవడం వల్ల కొత్త రైతులకు రైతుబంధు జమకాలేదని అధికారులు చెబుతున్నారు. పెట్టుబడి సాయం పంపిణీకి ప్రభుత్వం ప్రత్యేకంగా రైతుబంధు పోర్టల్ రూపొందించిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఇచ్చిన సమాచారాన్ని నేరుగా నిక్షిప్తం చేసి ఆమేరకు రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసినట్లుగా చెబుతున్నారు. గత వానాకాలం, ఈ యాసంగికి కూడా కొత్త రైతులు అర్హులు కాలేదు. ఇదేమిటిని ఆందోళన చెందుతున్న రైతులు అధికారులు మాత్రం సాంకేతిక కారణాలను చెప్తున్నారంటున్నారు. వ్యవసాయశాఖ అధికారులు మాత్రం భూములున్న అందరు రైతుల వివరాలు ఆన్‌లైన్ చేశామని చెబుతున్నారు.



ఉద్యోగుల పనితీరు అభినందనీయం

- ఆర్టీసీ వరంగల్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ కృపాకర్



శుభాకాంక్షలు తెలిపిన అనంతరం డ్రైవర్లతో డిప్యూటీ ఆర్ఎం కృపాకర్

భూపాలపల్లి: ఆర్టీసీ భూపాలపల్లి డిపో ఉద్యోగుల పనితీరు అభినందనీయమని ఆర్టీసీ వరంగల్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ కృపాకర్ అన్నారు. జనవరి 24న డ్రైవర్స్ డేను పురస్కరించుకొని మంగళవారం డిపో ఆవరణలో డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపారు. 15ఏళ్లుగా ప్రమాద రహితంగా వాహనాలు నడిపిన డ్రైవర్లకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థలో డ్రైవర్లే కీలకమన్నారు. డిపోను లాభాల బాటలో పయనించే విధంగా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. అంకితభావంతో పనిచేస్తూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రతిమ రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మికుల లబ్ధి కోసం మెరుగైన బెనిఫిట్స్



గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న మాధవనాయక్

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు మెరుగైన లబ్ధి చేకూరాలని 11వ వేతన సవరణతో పాటు రావాల్సిన బెనిఫిట్స్ కోసం ఇటీవల నిర్వహించిన జేబీసీసీఐ సమావేశంలో బీఎంఎస్ నిలదీసిందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యులు మాధవ నాయక్ తెలిపారు. ఏరియాలోని కేటీకే 11, 5వ గనుల్లో మంగళవారం గేట్‌మీటింగ్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా మాధవనాయక్ హాజరై మాట్లాడారు. సింగరేణి కార్మికులకు 11వ వేతన సవరణ ఉండదని కొన్ని కార్మిక సంఘాలు రాజకీయ ఎజెండాగా చేసుకొని ప్రచారం చేశాయన్నారు. బీఎంఎస్ మాత్రమే 11వ వేతన ఒప్పందం సాధిస్తామని కార్మికులకు ఇచ్చిన భరోసాను నిలుపుకుందన్నారు. 19శాతం వేతనం పెంపుపై జేబీసీసీఐ సమావేశాల్లో బీఎంఎస్ పెద్దన్న పాత్ర పోషించిందని తెలిపారు. కోల్ ఇండియా కార్మికులు ఒక్కరోజు సమ్మె చేయకుండా, ఉత్పత్తికి విఘాతం కలుగకుండా, ఒక రూపాయి నష్టపోకుండా అందరూ సంతోషపడే విధంగా సాధించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో కార్మికుల పక్షాన నిలబడి కార్మిక హక్కుల కోసం, మెరుగైన వేతనాలు సాధించడం కోసం పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. కార్మికుల సంక్షేమమే కాకుండా పరిశ్రమ పరిరక్షణ కోసం కూడా పనిచేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.25వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా సింగరేణి సంస్థను రూ.10వేల కోట్ల అప్పుల సంక్షేమంలోకి తొక్కిందని ఆరోపించారు. బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు 2015లో పార్లమెంట్‌లో మద్దతు తెలిపిన బీఆర్‌ఎస్ ఇప్పుడు అబద్దపు ప్రచారం చేస్తుందని చెప్పారు. తాడిచెర్ల బొగ్గు బ్లాక్ ఎందుకు ప్రైవేటుపరం చేశారని.. అందులో కాంట్రాక్టు ఎవరి కుటుంబానికి చెందిన వారికి ఇచ్చారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్, స్వామి, యూసఫ్, లక్ష్మణ్, నారాయణ, రమేష్, శ్రీనివాస్, రఘుపతి రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వాల పెద్దపీట
కాంట్రాక్ట్ అధ్యాపకుల సమ్మె నోటీస్
మూల్యాంకనం చేసే అవకాశం ఇవ్వాలి
పరీక్షల నిర్వహణ తీరు పరిశీలన
- 10లో▸

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

నెల్లికుదురు: విద్యుదాఘాతంతో వివాహిత మృతి చెందింది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం సోల్లతండా శివారు శనిగకుంట తండాలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. తండాకు చెందిన గుగులోత్ మంజుల(28) ఇంటి ముందు శుభ్రం చేసేందుకు రేకులపై ఉన్న చీపురు కట్టను తీసే ప్రయత్నం చేసింది. అయితే, రేకుల పైనుంచి ఇంట్లోకి వెళ్లిన సర్వీస్ వైరు తెగిపోయి రేకులకు తాకడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జితేందర్ తెలిపారు.

కలప ట్రాక్టర్ బోల్తా



వర్ధన్నపేట: కలప ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామ శివారులో రాయపర్తి మండలం ఊకల్లు గ్రామం నుంచి కలప లోడుతో వరంగల్‌కు వెళ్తున్న ట్రాక్టర్ మంగళవారం తెల్లవారుజామున అదుపుతప్పి బోల్తా పడింది. ఈ క్రమంలో డ్రైవర్ అప్రమత్తమై కిందకు దూకడంతో ప్రాణాపాయం తప్పి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడిగా మొగిలిచెర్ల సుదర్శన్



ఖిలా వరంగల్: వినియోగదారుల సమాఖ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, సీసీసీ(కన్స్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్) సౌత్ స్టేట్ ఉపాధ్యక్షుడు, వినియోగదారుల జాతీయ అపెక్స్ కమిటీ సీసీఐ(కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా శివనగర్‌కు చెందిన మొగిలిచెర్ల సుదర్శన్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం సీసీఐ జాతీయ బాధ్యులు డాక్టర్ అనంత శర్మ, డాక్టర్ అరుణ్‌కుమార్, దేవేంద్ర తివారి, ప్రీతి పాండ్యా, విజేంద్రప్రకాశ్ హాల్‌చల్, కైలాష్ కమాత్ బృందం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్ర గవర్నర్‌ను కలిసి వినియోగదారుల చట్టాల్లోని లోపాలను సవరించాలని కోరుతానని సుదర్శన్ ఈ సందర్భంగా తెలిపారు. నియామకానికి సహకరించిన జాతీయ, రాష్ట్ర కమిటీలు, సహ ఉద్యమకారులు సాంబరాజు చక్రపాణి, పల్లేపాడు దామోదర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- కొడకండ్లలో కుట్టు శిక్షణ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

కొడకండ్ల: మహిళలకు అన్ని విధాలుగా చేయూతనిస్తూ వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర మండల సమాఖ్యలో మహిళలకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రథమంగా కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని పాలకుర్తిలో ప్రారంభించామని తెలిపారు. రూ.5 కోట్లతో 3 వేల మంది మహిళలకు 45 రోజులపాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ట్రెనింగ్ పూర్తయిన తర్వాత పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకందించే దుస్తులు కుట్టే బాధ్యత అప్పగిస్తామని, అలాగే అర్హత కలిగిన వారికి టెక్స్‌టైల్ పార్క్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రమంతా విస్తరిస్తామని అన్నారు. ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా మహిళలకు అత్యధికంగా రుణాలందించామని, మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే ఆ కుటుంబం బాగుందని తెలిపారు. అందివచ్చిన అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం శ్రీనిధి రుణం ద్వారా సోలార్ పథకాన్ని ప్రారంభించారు. బాలికల దినోత్సవం సందర్భంగా మంత్రి బాలికలకు మిఠాయిలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రైతువేదికలోని కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి నిర్వహణ, కంటి పరీక్షలను పరిశీలించడంతోపాటు ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డీఆర్‌డీఓ రాంరెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ జ్యోతి, మార్కెట్ చైర్మన్ రాము, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ, సర్పంచ్, ఎంపీటీసీలు మదుసూధన్, విజయలక్ష్మి, నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

31న కమలాపూర్‌కు మంత్రి కేటీఆర్

- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్సీ



ఎంజేపీ గురుకుల పాఠశాల ఆవరణలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ

కమలాపూర్: రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఈ నెల 31న కమలాపూర్‌లో పర్యటించనున్నట్లు హనుమకొండ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం కమలాపూర్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ కమలాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. ముఖ్యంగా మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల నూతన భవనాలను, కుల సంఘ భవనాలు, కేజీబీవీ జూనియర్ కళాశాల, ప్రభుత్వ కళాశాల భవనాలను ప్రారంభించి బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు పాఠశాలల ఆవరణలో సుందరీకరణ పనులతో పాటు మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. బందోబస్తు, కాన్వాయ్, హెలిపాడ్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బండ శ్రీనివాస్, డీఆర్వో వాసుచంద్ర, బీసీ సంక్షేమశాఖ అధికారి రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, డైరెక్టర్ సత్యనారాయణరావు, కేడీసీసీబీ డైరెక్టర్ కృష్ణప్రసాద్, తహసీల్దార్ రాణి, ఎంపీడీఓ పల్లవి, బీఆర్‌ఎస్ నాయకులు ప్రదీప్‌రెడ్డి, దశరథం, తిరుపతిరెడ్డి, అశోక్, రవి, మల్లారెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న గట్టు రాంచందర్‌రావు

నయీంనగర్: వైఎస్సార్ తెలంగాణ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని పార్టీ రాజకీయ కార్యాచరణ కమిటీ సభ్యుడు గట్టు రామచందర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని వైఎస్సార్‌టీపీ కార్యాలయంలో వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షుడు నాడెం శాంతికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో రామచందర్‌రావు మాట్లాడారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయం వైఎస్సార్‌టీపీ మాత్రమేనన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్ట రాంరెడ్డి మాట్లాడుతూ త్వరలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరగనున్న వైఎస్ షర్మిల ప్రజాప్రస్థానం పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యాచరణ సభ్యులు ఏపూరి సోమన్న, నీలం రమేష్, గడిపెల్లి కవిత మాట్లాడుతూ వైఎస్సార్ తెలంగాణ పార్టీకి దివంగత మహానేత డా.వైఎస్‌ఆర్ పథకాలే ప్రచార అస్త్రాలని, ప్రజా సమస్యలపై నిత్యం పోరాడితేనే ప్రజల్లో పార్టీకి, నాయకులకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీరవెల్లి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి చల్లా అమరేందర్‌రెడ్డి, మారం రెడ్డి కొటిల్‌రెడ్డి, అప్పం కిషన్, రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశంగౌడ్, సుమిత్‌గుప్త, రాబర్ట్, సమ్మయ్య, రాములునాయక్, వెంకట్‌రెడ్డి, స్వామి, వినోద్ కుమార్, రఘు, శోభ, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

బ్రెడ్ తయారీ కేంద్రం సీజ్



అభిరుచి మిల్క్ బ్రెడ్ తయారీ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

వరంగల్ అర్బన్: వరంగల్ ఏనుమాముల మార్కెట్ సమీపంలో ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న అభిరుచి మిల్క్ బ్రెడ్ తయారీ కేంద్రంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. బ్రాండ్ పేరుతో కొలతలు లేకుండా, ఫార్మాలిన్ రసాయనం ఉపయోగిస్తూ బ్రెడ్, ఇతర ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. బ్రెడ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని నిర్వాహకుడైన హనుమకొండ లక్ష్మీపురానికి చెందిన అడ్లూరి జనార్దన్‌కు రూ.20వేల జరిమానా విధించారు. అలాగే, తయారీ కేంద్రాన్ని సీజ్ చేశారు. తనిఖీల్లో అడిషనల్ డీసీపీ రఘునాథ్ గైక్వాడ్, ఏసీపీ జితేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వర్లు, ఎస్సై లవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో యావజ్జీవ శిక్ష

రఘునాథపల్లి: లిఫ్ట్ ఇస్తానంటూ వృద్ధురాలిని ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జనగామ జిల్లా కోర్టు న్యాయమూర్తి కె.శైలజ తీర్పు వెలువరించారు. ఎస్సై వీరేందర్ కథనం ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కోమళ్ల గ్రామానికి చెందిన ఎండి అక్బర్ 2017లో అదే గ్రామానికి చెందిన వృద్ధురాలికి బస్టాండ్ నుంచి లిఫ్ట్ ఇస్తానని నమ్మబలికి బైక్‌పై నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పలుమార్లు కోర్టులో వాదనలు జరిగాయి. నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

చోరీ కేసు.. పోలీసుల అదుపులో ముగ్గురు

కురవి: మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో ఇటీవల మూడు ఇళ్లల్లో చోరీ జరిగిన ఘటనలో కురవికి చెందిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 20న 'మూడు ఇళ్లల్లో చోరీ' అనే కథనం సాక్షిలో ప్రచురితమైంది. స్పందించిన పోలీసులు అదే కాలనీతోపాటు పక్క కాలనీకి చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, దొంగతనంలో ముగ్గురితోపాటు మరికొందరి హస్తం ఉన్నట్లు సమాచారం. పోలీసుల అదుపులో ఉన్న వారిలో మైనర్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే విషయమై ఎస్సై బి.రామునాయక్‌ను వివరణ కోరగా విచారణ కొనసాగుతోందని, రెండు రోజుల్లో కేసును చేధిస్తామని తెలిపారు.

వరంగల్ ఆర్టీఏలో అన్నీ సమస్యలే..

- అధికారులను నిలదీసిన వాహనదారులు



వరంగల్ ఆర్టీఏలో అధికారులను నిలదీస్తున్న వాహనదారులు

ఖిలా వరంగల్: వరంగల్ ఆర్టీఏ కార్యాలయంలో అన్నీ సమస్యలే కనిస్తున్నాయి. హోంగార్డుల మొదలు అధికారుల వరకూ ఇష్టారాజ్యమే. ఏదైనా సమస్య వస్తే మాపై అధికారిని కలవండి.. అధికారిని కలిస్తే ఆపై అధికారిని కలవాలంటూ సమాధానం చెప్పడమే తప్పా సమస్య పరిష్కారం కావడం లేదు. సమస్య చిన్నదైనా చేయి తడపనిదే పని జరిగే పరిస్థితి లేదు. పేరుకే అవినీతి రహిత సేవలు కానీ దొడ్డి దారిలో అన్ని నడుస్తున్నాయి. ఆర్టీఓ ఉన్నట్లే కానీ ఎవరూ కలువలేరూ.. సమస్య చెబుకునేందుకు సమయమూ ఇవ్వరు. దీంతో వాహనదారులు ఆర్టీఏ కార్యాలయం చుట్టూ తిరగలేక సహనం కోల్పోయి మంగళవారం అధికారులను నిలదీశారు. తానేమీ చేయలేను ఆర్టీఓను కలవండి అంటూ సమాధానం చెప్పడంతో వాహనదారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సేవలు కాసేపు నిలిచిపోయాయి. ఆ తర్వాత అధికారుల జోక్యంతో కార్యకలాపాలు యధావిధిగా జరిగాయి. కాగా, కార్డులు పోస్ట్ చేయడం లేదని, ట్రాఫిక్ పోలీసులు కార్డు లేకపోతే వాహనం సీజ్ చేస్తున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్టీఓ స్థాయి అధికారి స్పందించి సమస్యలు పరిష్కారించాలని వాహనదారులు కోరుతున్నారు.

మావోయిస్టు సానుభూతిపరుడి అరెస్ట్

- జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్స్, విప్లవసాహిత్యం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ



స్వాధీనం చేసుకున్న విప్లవ సాహిత్యం, పేలుడు సామగ్రి

కాటారం: గతంలో నిషేధిత మావోయిస్టు పార్టీలో పనిచేసి ప్రస్తుతం వారికి సానుభూతిపరుడిగా వ్యవహరిస్తున్న వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. వివరాలను కాటారం పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా నందిమేడారం గ్రామానికి చెందిన పొలం రాజయ్య ప్రస్తుతం ధర్మారంలో మిషన్ భగీరథ హెల్పర్‌గా పని చేస్తున్నాడు. గతంలో పెద్దపల్లిదళం, తదితర దళాల్లో పనిచేశాడు. కరీంనగర్ జిల్లాకు సంబంధించి ప్రొటెక్షన్ ప్లాటూన్‌లో ముఖ్యమైన మావో నేతలకు రక్షణ కల్పిస్తూ వివిధ ప్రాంతాలకు తరలించడంలో రాజయ్య కీలక దళ సభ్యుడిగా పని చేసేవాడు. ఆ సమయంలో ప్రస్తుత మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శి కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేశ్‌తో పరిచయం ఏర్పడింది. కాగా, 2002లో లొంగిపోయిన రాజయ్య ప్రభుత్వం ఇచ్చిన భూమిలో ఇల్లు కట్టుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. అంతలోనే నాలుగు నెలల క్రితం కంకణాల రాజిరెడ్డి రాజయ్యకు ఫోన్ చేసి పరిస్థితులపై ఆరా తీశాడు. ఈ క్రమంలో తిరిగి మావోల కోసం పని చేస్తానని రాజయ్య చెప్పాడు. దీంతో మావోయిస్టు రాజిరెడ్డి ఆదేశాల మేరకు నూతన రిక్రూట్‌మెంట్ కోసం యువతలో విప్లవ భావాలు నింపి ఆకర్షితులను చేసే పనిలో పడ్డాడు. ఇందులో భాగంగా తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్న కంకణాల రాజిరెడ్డిని కలవడానికి విప్లవ సాహిత్యం, పేలుడు పదార్థాలు తీసుకుని కాటారం మీదుగా బైక్‌పై వెళ్తున్నాడు. బొప్పారం క్రాస్ వద్ద పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా ఎస్సై-2 సుధాకర్, సిబ్బంది వెంబడించి పట్టుకుని విచారించారు. రాజయ్య నుంచి విప్లవ సాహిత్యం, కరపత్రాలు, మందుగుండు సామగ్రి కలిగిన నాలుగు జిలెటిన్ స్టిక్స్, నాలుగు డిటోనేటర్లు, ఫోన్, బైక్ స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టు సానుభూతిపరుడిని అరెస్ట్ చేసి వివరాలు సేకరించిన సీఐ రంజిత్‌రావు, ఎస్సైలు శ్రీనివాస్, సుధాకర్, రమేశ్‌లను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో సీఐ రంజిత్‌రావు, సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, ఎస్సైలు శ్రీనివాస్, సుధాకర్, రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ యూనిట్ ఏర్పాటుతో బిల్లులు తగ్గుతాయి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌రావు

హన్మకొండ: సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని.. అదనపు చార్జీల సమస్య రాదని ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. ఏసీడీ, డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లించని వారు విద్యుత్ సర్వీస్ తొలగించుకోవాల్సిందేనా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సీఎండీ పైవిధంగా స్పందిస్తూ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని సలహా ఇచ్చారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనల మేరకు విద్యుత్ వినియోగదారులు డిపాజిట్ చెల్లించాల్సిందేనని, విద్యుత్ సర్వీస్ తీసుకున్నప్పుడు చేసుకునే అగ్రిమెంట్‌లో నిబంధనలు స్పష్టంగా ఉన్నాయని వివరించారు. తమకు వినియోగదారులు శత్రువులు కాదని, ఏసీడీపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో స్పందించాల్సి వచ్చిందన్నారు. విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ నిబంధన-6 ప్రకారం ఏసీడీ విధిస్తున్నామని, ఏసీడీపై సందేహాలుంటే ఈఆర్‌ఓ వద్దకు వెళ్లి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలో 7,16,000 మంది వినియోగదారులు రూ.305 కోట్ల బకాయిలున్నారని వివరించారు. ఇలాంటి రాని బకాయిలతో సంస్థకు ఆర్థిక ఇబ్బందులు వస్తున్నాయన్నారు. వీటిని నివారించడానికి విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు అదనపు సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేస్తున్నామని తెలిపారు. బకాయిల చెల్లింపునకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం విద్యుత్ సంస్థల్లో లేదని స్పష్టం చేశారు. సమావేశంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్ రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి.తిరుపతి రెడ్డి, సీజీఎం మధుసూదన్, డీఈ(ఐటీ) అనిల్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు లేకుండా తీర్చిదిద్దాలి

గ్రామాలను విద్యుత్ సమస్యలు లేకుండా తీర్చిదిద్దాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం నక్కలగుట్టలోని క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఎస్‌ఈలు, డీఈలు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్‌తో సమీక్ష నిర్వహించారు. జిల్లాలు, డివిజన్లు, విభాగాల వారీగా ప్రగతిని సమీక్షించారు. దత్తత గ్రామాల్లో కాలిపోయిన, పని చేయని మీటర్లు ఉండకూడదని.. డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించాలని ఆదేశించారు. డైరెక్టర్లు బి. వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి. తిరుపతిరెడ్డి, సీజీఎంలు అశోక్‌కుమార్, టి.మధుసూదన్, రాజుచౌహాన్, నిజామాబాద్ ఎస్‌ఈ రవీందర్, కామారెడ్డి ఎస్‌ఈ రమేష్, డీఈ(ఐటీ) అనిల్ కుమార్ పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

ఏటూరునాగారం: అత్తామామ, మరిది, ఆడబిడ్డ వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకుంది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం షాపెల్లికి చెందిన కుక్కల కిరణ్- కవిత(28)కు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి సంతానం కలుగలేదు. దీంతో మనస్తాపానికి గురైన కిరణ్ రెండు నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి అత్తామామలు సుగుణ, మణెయ్య, మరిది రాజు, ఆడబిడ్డ లింగాల సుజాత కవితను వేధిస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురై ఈనెల 22వ తేదీ తెల్లవారుజామున పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కవిత సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి తుర్రి సునంద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

ఉపాధ్యాయురాలు దేవిక సస్పెన్షన్

కాశీబుగ్గ సెంటర్/రాయపర్తి: వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయురాలు(స్కూల్ అసిస్టెంట్) అంబటి దేవికను సస్పెండ్ చేసినట్లు డీఈఓ వాసంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవిక ఈ నెల 20న కారణం లేకుండా 7వ తరగతి విద్యార్థులను కొట్టడంతో తీవ్ర గాయాలైనట్లు పాఠశాల హెచ్‌ఎం, ఇతర సిబ్బంది లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారని, విచారణ అనంతరం ఆమెను సస్పెండ్ చేసినట్లు డీఈఓ పేర్కొన్నారు. అలాగే, నెక్కొండ మండలం వెంకటాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు(ఎస్‌జీటీ) ఎం.వీరన్న పనివేళల్లో నిద్రిస్తున్నాడని పత్రికల్లో రావడంతో షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు తెలిపారు.

ఉద్యోగ నిర్వహణలో నైపుణ్యం ప్రదర్శించాలి



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఆర్జేడీ ఝాన్సీలక్ష్మీబాయి

మడికొండ: శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాన్ని ఉద్యోగ నిర్వహణలో ఆచరించాలని మహిళా శిశు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆర్జేడీ ఝాన్సీలక్ష్మీబాయి అన్నారు. బాలికల దినోత్సవం సందర్భంగా.. మడికొండ శివారు దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో డీడీయూ-జీకేవై ఆధ్వర్యంలో (యంపీహెచ్‌డబ్ల్యూ) శిక్షణ పొందుతున్న విద్యార్థినులతో జాతీయ ప్రాంగణం జిల్లా మేనేజర్ జయశ్రీ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మీలో ఓర్పు, సహనంతో అందరికీ సేవ చేయాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులకు కిట్లు అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ప్రాంగణ సిబ్బంది పాల్గొన్నారు.

మందు పిచికారీ చేస్తే మాడిపోయిన మిర్చి పంట



పిచికారీ చేసిన మందు డబ్బాలను చూపుతున్న రైతు ఈర్య

చెన్నారావుపేట: మిర్చి చేనుకు పురుగు మందులు పిచికారీ చేస్తే మొక్కలు మాడిపోయిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పుల్లయ్య బోడుతండా శివారు లింగ్యాతండాలో మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన భూక్య ఈర్య ఎకరం భూమిలో తేజ రకం మిర్చి సాగు చేశాడు. పంటకు తెగుళ్లు ఆశించడంతో ఈ నెల 19న పాపయ్యపేటలోని సరస్వతి ఫర్టిలైజర్ షాపు యజమాని లింగాల సూరయ్య వద్దకు వెళ్లి పురుగు మందులు కొనుగోలు చేసి పిచికారీ చేశాడు. మరుసటి ఉదయం వెళ్లి చూసేసరికి పంట మొత్తం మాడిపోయి కనిపించింది. దీంతో షాపు యజమాని సూరయ్య వద్దకు వెళ్లి ప్రశ్నించగా పట్టించుకోవడం లేదు. వ్యవసాయశాఖ అధికారులు పంటను పరిశీలించి న్యాయం చేయాలని ఈర్య వేడుకుంటున్నాడు. ఈ విషయమై ఏఓను వివరణ కోరగా పంటను పరిశీలిస్తామని తెలిపారు.



సీసా గలాటా.. పంటకు రక్షణ



పక్షుల బారి నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు వినూత్న ఆలోచనలు చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా అమనగల్ గ్రామ శివారులో రైతులు తాము సాగు చేస్తున్న పచ్చజొన్న, మొక్కజొన్న పంటలను కాపాడుకునేందుకు సమీప ప్రాంతంలో గల చెట్లకు మద్యం సీసాలకు రాళ్లను జోడించి ఏర్పాటు చేశారు. ఏ మాత్రం కొద్ది మేరలో గాలి వీచినా మద్యం సీసాకు కట్టిన రాయి దానికి తగులుతూ శబ్దం వస్తుంది. ఈ శబ్ధంతో పక్షులు ఆ పంట చేలపై పడి తినకుండా కాడుకోగలుగుతున్నామని రైతులు తెలిపారు.

- మహబూబాబాద్ రూరల్